సాక్షి
జోగుళాంబ గద్వాల
ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



భజే.. జోగుళాంబ మాత

అలంపూర్ జోగుళాంబ ఆలయంలో నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

వివరాలు 10లో ►



సడక్ బంద్ ఉద్రిక్తం..

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలంటూ చేపట్టిన సడక్ బంద్ ఉద్రిక్తంగా మారింది.

వివరాలు 10లో ►

గరిష్టం/కనిష్టం
38.7 /20.1

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. రాత్రిళ్లు చలి తీవ్రత కాస్త ఉంటుంది.

న్యూస్‌రీల్

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



మానవపాడు: మండలకేంద్రంలోని ఆరోగ్యకేంద్రం నందు శనివారం డబ్ల్యూహెచ్ఓ బృందం సభ్యులు విష్ణు, అభిలాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యకేంద్రలలో టీకాలను సరైన సమయానికి వేయాలని సూచించారు. వ్యాక్సిన్ అందించకపోతే చిన్నారులు రోగాలబరిన పడతారన్నారు. ఆరోగ్యకేంద్రాలలో వ్యాక్సిన్ ఉందా? సరైనా సమాయానికి వేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులకు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ సత్యానారాయణ, ఫార్మాసిస్ట్ తిరుమాల్‌రావు, ఆశలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంజన్న నామస్మరణతో మార్మోగిన బీచుపల్లి



ఎర్రవల్లిచౌరస్తా: అమావాస్యను పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం శనివారం అంజన్న నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అభయాంనేయస్వామికి పంచామృత అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లి క్షేత్రానికి చేరుకొని కృష్ణానదిలో స్నానాలు ఆచరించి అనంతరం భక్తిశ్రద్ధలతో అభయాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ ఈఓ రామన్‌గౌడ్ పేర్కొన్నారు.

రగ్బీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్ల సత్తా



మహబూబ్‌నగర్ క్రీడలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్లు సత్తా చాటాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో శనివారం ముగిసిన అండర్–17, 19 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ టోర్నీలో ఉమ్మడి జిల్లా బాలికల జట్లు మెరుగైన ప్రదర్శన కనబరిచాయి. బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టు ఫైనల్ మ్యాచ్‌లో 6–0 (ట్రై) పాయింట్ల తేడాతో నల్లగొండ జిల్లా జట్టుపై గెలుపొంది చాంపియన్‌గా నిలిచింది. బాలుర విభాగంలో జిల్లా జట్టు మూడోస్థానంలో నిలిచింది. అండర్–19 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్‌లో జిల్లా జట్టు 6–0 (ట్రై) పాయింట్ల తేడాతో మెదక్ జట్టుపై విజయం సాధించింది. ఈ సందర్భంగా జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

● 'అలంపూర్'పై ఉత్కంఠ

బీఫాం ఎవరికో..?

ఎమ్మెల్యేపై భగ్గుమంటున్న అసమ్మతితో ఊగిసలాట

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ముఖ్య నేతల సమాలోచనలు
- తెరపైకి విజయుడు.. ఎమ్మెల్సీ 'చల్లా'కు అనుచరుడిగా గుర్తింపు
- నాకే వస్తుందనే ధీమాలో డాక్టర్ అబ్రహం
- నేడు లేదంటే వారం రోజుల్లో సస్పెన్స్ వీడే అవకాశం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిరేపుతున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థి అబ్రహం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ సొంతపార్టీలోనే అసమ్మతి తారస్థాయికి చేరుకోవడం.. ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ అన్నట్లు వార్ కొనసాగుతుండడం చర్చనీయాంశంగా మారాయి. ఆదివారం బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రకటన తర్వాత.. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ బీఫాంలు అందజేయనున్న నేపథ్యంలో 'అలంపూర్'పై ఉత్కంఠ నెలకొంది. ఇదివరకే ప్రకటించిన అభ్యర్థి అబ్రహంకు బీఫాం అందజేస్తారా.. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సూచించిన అభ్యర్థికి ఇస్తారా.. లేదంటే కొంతకాలం పెండింగ్‌లో పెడతారా అనే అంశం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారింది. మరోవైపు 'చల్లా' మదిలో ఉన్న వ్యక్తి పేరు తాజాగా వెలుగులోకి రాగా.. కొత్త ముసలం మొదలైనట్లు తెలుస్తోంది.

తెరపైకి విజయుడు..



అబ్రహంకు బీఫాం ఇవ్వకుండా అడ్డుకోవాలనే ఉద్దేశంతో ముందస్తు స్కెచ్‌లో భాగంగా ఎమ్మెల్సీ చల్లా వర్గీయులు పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు వెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొన్నిరోజుల క్రితం ఎమ్మెల్సీ.. బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సమావేశం కాగా.. తన మదిలో ఉన్న పుల్లూరుకు చెందిన ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ విజయుడు అలియాస్ విజయ్ పేరును ఆయన ప్రస్తావించినట్లు సమాచారం. అందుకు వారు బాగుండదని అనగా.. గెలిపించే బాధ్యత తనదేనని చల్లా చెప్పినట్లు తెలిసింది. ఆ తర్వాత అసమ్మతులను బుజ్జగించేలా నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బాధ్యతను ఎమ్మెల్సీకి కట్టబెట్టినట్లు తెలుస్తోంది.

ఊగిసలాట.. సమాలోచనలు

వచ్చే ఎసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా బీఆర్ఎస్ అధినేత అందరికంటే ముందుగా ఆగస్టు 21న అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఉమ్మడి పాలమూరులో 14 స్థానాలుండగా.. అంతటా సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అవకాశం కల్పించారు. ఈ క్రమంలో అలంపూర్, మక్తల్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చాలంటూ అసమ్మతి పెల్లుబికింది. అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించి తొలుత పలు మండలాల్లో చల్లా వర్గీయులుగా ముద్రపడిన అసంతృప్త నాయకులు సమావేశాలు నిర్వహించినా.. ఆ తర్వాత సద్దుమణిగింది. ఇక బీఫాంలు అందజేస్తారు అన్న క్రమంలో ఒక్కసారిగా అసమ్మతి భగ్గుమనడం.. పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు వెళ్లి కేటీఆర్‌ను కలవడం.. అభ్యర్థిని మార్చాలంటూ వినతిపత్రం అందజేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఎమ్మెల్సీనే ఎన్నికల ఇన్‌చార్జిగా ప్రకటించిన తర్వాత కూడా పరిస్థితి కుదుటపడకపోవడంతో బీఆర్ఎస్ అధిష్ఠానం పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. దీనిపై ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులతో పాటు ముఖ్య నాయకులతో సీఎం కేసీఆర్ సమాలోచనలు చేసినట్లు తెలిసింది. అలంపూర్‌పై ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియదని.. బహుశా పెండింగ్‌లో పెట్టే అవకాశం ఉన్నట్లు ముఖ్య నేతలు భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

పట్టుబడుతున్న 'మందా'..

అసమ్మతి నేతలు హైదరాబాద్‌కు వెళ్లిన క్రమంలో విజయుడుతో కలిసి ఎమ్మెల్సీ జోగుళాంబ ఆలయంలో పూజలు నిర్వహించడం మరో ముసలానికి దారితీసినట్లు తెలుస్తోంది. విజయుడిని తెర మీదకు తీసుకురావడంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ సీనియర్ నేత, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మందా జగన్నాథం బాహాటంగానే నిప్పులుగక్కారు. పార్టీ కోసం కష్టపడిన వారిని కాదని.. వ్యక్తిగత సహాయకులకు టికెట్ ఇవ్వాలని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం కష్టపడిన తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. దీనిపై ఇప్పటికే ఆయన బీఆర్ఎస్ ముఖ్య నేతల వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. మరోవైపు ఎమ్మెల్సీ తీరుతో పాటు పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారంటూ పలు అంశాలను గులాబీ శ్రేణుల్లోకి బలంగా తీసుకెళ్లేలా ఎమ్మెల్యే వర్గీయులు సమాయత్తమవుతున్నట్లు వినికిడి. అలంపూర్ అభ్యర్థిని తానేనని.. ప్రజాబలం తనకే ఉందని.. తనకే బీఫాం వస్తుందని ఎమ్మెల్యే అబ్రహం ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా, అభ్యర్థిని మారుస్తారా.. అబ్రహంకే బీఫాం ఇస్తారా.. కేసీఆర్ మదిలో ఏముంది అనేది ఆదివారం లేదంటే వారం లోపు తేలనున్నట్లు తెలుస్తుండగా.. పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- మద్యం, డబ్బు, బంగారంపై ప్రత్యేక నిఘా
- నూతన ఎస్పీ రితిరాజ్



బల్గెర చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ రితిరాజ్

గట్టు/కేటీదొడ్డి: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సరిహద్దులోని చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఉంచాలని పోలీస్ సిబ్బందిని నూతన ఎస్పీ రితిరాజ్ ఆదేశించారు. శనివారం ఆమె కేటీదొడ్డి మండలంలోని నందిన్నె, గట్టు మండలంలోని కర్నూలు – రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై బల్గెర వద్ద ఉన్న చెక్‌పోస్టులను ఆమె తనిఖీ చేశారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించాలని, అన్ని రకాల వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. గోవా, కర్ణాటక నుంచి మద్యం, డబ్బు రవాణా చేస్తే చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో 24 గంటలు తనిఖీలు ఉంటాయని, ప్రజలు సహకరించాలని కోరారు. మద్యం, డబ్బు, అక్రమ రవాణ, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ సొమ్మును తీసుకెళ్తే వాటిని సీజ్ చేస్తామన్నారు. చెక్‌పోస్టుల దగ్గర విధులను నిర్వహించే పోలీస్ సిబ్బందికి సరైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐలు బానోత్ పటేల్, ఎండీ ఖలీల్, ఎస్ఐ నందికర్ తదితరులు పాల్గొన్నారు.

పాగుంట ఆలయంలో అడిషనల్ కలెక్టర్ ప్రత్యేక పూజలు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలోని పాగుంట లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామి వారిని అమావాస్య సందర్భంగా శనివారం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ దర్శించుకున్నారు. అనంతరం వేద మంత్రాలతో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయానికి బంగారం వితరణ

పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారి కిరిటం నిమిత్తం కొండాపురానికి చెందిన చాకలి గోవిందు ఆలయ సిబ్బందికి అర తులం బంగారం అందజేశారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో అడిషనల్ కలెక్టర్ చీర్ల శ్రీనివాస్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ఉండవెల్లిలో మహిళలతో సమావేశమైన వీఎస్‌టీ సంస్థ ప్రతినిధులు

ఉండవెల్లి: మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలని, అందుకే తెలంగాణ వర్తక సమాఖ్య వారిచే శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షుడు జయదేవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళా సాధికారత కార్యక్రమాన్ని వీఎస్‌టీ(గ్రామాలయ) ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలకు ఉపయోగపడే క్రమంలో శిక్షణలు నిర్వహించడంతో పాటు, ప్రతి మండలంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జీఎం జయచంద్రరెడ్డి, శాంతి, ఈడీ ఎలోగవన్, రామచంద్రన్ పాల్గొన్నారు.

అభివృద్ధికి అండగా నిలవాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



రుద్రసహిత చండీహోమంలో మంత్రి నిరంజన్‌రెడ్డి దంపతులు

పెబ్బేరు రూరల్: నియోజకవర్గ అభివృద్ధికి అండగా నిలిచి బీఆర్ఎస్ పార్టీకి మద్దతిచ్చి గెలిపించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని మంత్రి నివాసంలో బీజేపీకి చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరగా మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రెండుతరాల భవిష్యత్ కోల్పోయామని.. సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన దేశానికి దిక్సూచిలా నిలుస్తుందని.. ప్రజల ఆశీస్సులతో మూడో సారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు..

అమావాస్యను పురస్కరించుకొని శనివారం వనపర్తి మండలం రాజనగరంలోని రామకృష్ణేశ్వర దేవాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. శనైశ్వరస్వామికి నువ్వులతో అభిషేకం, రాహుకేతులకు గంగాభిషేకం, శివాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం రుద్రసహిత చండీహోమం నిర్వహించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకిటి శ్రీధర్, పట్టణ ఇన్‌చార్జ్ అరుణ్‌ప్రకాష్, కౌన్సిలర్ నాగన్నయాదవ్, నాయకులు విజయ్, కురుమూర్తియాదవ్, ఆవుల రమేష్, తిరుమల్, గోపాల్, శ్రీనివాస్‌గౌడ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పనికో రేటు..

ఇటిక్యాల మండలం షాబాద్‌కు చెందిన ఓ రైతు తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. కానీ, రూ.46వేల లంచం ఇస్తేనే ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేస్తామని ట్రాన్స్‌కోలో కీలక పోస్టులో ఉన్న ఓ అధికారి అసిస్టెంట్ (మధ్యవర్తి) తెలపడంతో అడిగినంతా ఇచ్చుకున్నాడు. ఆ తర్వాత ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి కనెక్షన్ ఇచ్చారు. కానీ, మరో రూ.5వేలు ఇవ్వాలంటూ లైన్‌మన్ ఒత్తిడి తెచ్చాడు. రైతు ఇవ్వకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్‌ను తొలగించాడు. దీంతో సదరు పొలంలో వేసిన పంట వాడుపట్టింది. దీనికి కారణమైన ఏఈ, లైన్‌మన్, మధ్యవర్తిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతు గురువారం కలెక్టర్, ట్రాన్స్‌కో ఎస్ఈ భాస్కర్, డీఈకి ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు పొక్కింది.



జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం

విద్యుత్ శాఖలో వసూళ్ల పర్వం

- మీటర్ బిగించినా.. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినా చేయి తడపాల్సిందే..
- కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారుల వరకు వాటాలు
- డబ్బులు ఇవ్వకుంటే కార్యాలయాల చుట్టూ తప్పని ప్రదక్షిణ



గద్వాల అర్బన్: కొత్త విద్యుత్ మీటర్ బిగించాల్సినా.. సర్వీసు రీడింగ్‌లో తప్పులు సరిచేయాలన్నా.. వినియోగదారుడి పేరు మార్పు.. స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు.. ఇలా ఒక్కో పనికి ఒక్కో రేటు చెబుతూ వసూళ్లకు పాల్పడుతున్నారు. జిల్లాలోని విద్యుత్‌శాఖలో కొందరు ఉద్యోగులు, సిబ్బందిలో అవినీతి ధనదాహం రోజురోజుకు మితిమీరిపోతుందనే ఆరోపణలు వినవస్తున్నాయి. వసూలు రాజాలుగా మారి ప్రతి పనికి ఓ రేటు చొప్పున వినియోగదారుల నుంచి దండుకుంటూ జేబులు నింపుకొంటున్నారని సమాచారం. కింది స్థాయి సిబ్బంది నుంచి పై స్థాయి కీలక అధికారుల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేయి తడపనిదే పని చేయడం మానేశారు. ఒకవేళ అడిగినంత ఇవ్వకుంటే కార్యాలయాలు, సిబ్బంది చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

వసూలురాజాలు..

షాబాద్‌లోని ఓ రైతు వద్ద నుంచి ఏకంగా రూ.46వేలు లంచంగా మధ్యవర్తి వసూలు చేశాడంటే విద్యుత్ శాఖలో ఏమేర వసూళ్లకు పాల్పడుతున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అసలు కంటే వడ్డీపైనే ప్రేమ ఎక్కువ అన్న చందంగా కొందరు విద్యుత్ ఉద్యోగులు, సిబ్బందికి రూ.వేలకు వేలు వేతనం అందుతున్నా అక్రమార్జనే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని గద్వాల, ధరూరు, కేటిదొడ్డి, గట్టు, మల్దకల్, అయిజ, రాజోళి, శాంతినగర్, అలంపూర్, వడ్డేపల్లి, ఇటిక్యాల, మానవపాడు, ఉండవెల్లి మండలాల పరిధిలోని ఆయా గ్రామాల రైతులు, వినియోగదారులు సంస్థ నిర్ణీత మొత్తాన్ని డీడీ రూపంలో చెల్లించినా.. పని పూర్తి కావాలంటే అడినంత ఇచ్చుకోవాల్సిందే. ఇంటి కొత్త మీటర్ కనెక్షన్‌కు రూ.వెయ్యి నుంచి రూ.1500వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక నూతనంగా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం బోరు మోటార్లకు కొత్త కనెక్షన్ ఇవ్వాలన్నా, పాత కనెక్షన్ సామర్థ్యం పెంచాలన్నా.. తదితర వాటికి ముడుపులు చెల్లించాల్సిందే. అదేవిధంగా స్తంభాల, లైన్ల ఏర్పాటు, మార్పిడికి కాంట్రాక్టర్లను వదలకుండా వసూలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఓవర్‌లోడింగ్, మీటర్ మార్పిడి, పెనాల్టీ తదితర అంశాల్లో వినియోగదారులు ఎక్కువగా సమస్యలు ఎదుర్కొంటుండగా ఇదే అదనుగా విద్యుత్ సిబ్బంది డబ్బు వసూలు చేస్తున్నారు. మరికొందరు డీడీ రుసుం కంటే మూడింతలు అదనంగా తీసుకొని మీటర్ కనెక్షన్ ఇస్తామంటూ వసూలు చేస్తున్నారు.

అసిస్టెంట్లతోనే వ్యవహారం

ట్రాన్స్‌కోలో కొంతమంది లైన్‌మన్లు తమ చేతి కింద ప్రయివేటు అసిస్టెంట్లను నియమించుకున్నారు. వీరి ద్వారానే అన్ని పనులు చక్కబెడుతున్నారు. లైన్‌మన్లు చేయాల్సిన పనులను వారి ద్వారా చేయిస్తూ ఇటు కనెక్షన్లు అటు వసూళ్ల అంతా వారి ద్వారానే చేయిస్తున్నారని తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల ద్వారా పనులు చేయిస్తు అలా కార్యాలయానికి వెళ్లి వస్తూమమ అనిపిస్తున్నారు. సదురు ప్రయివేటు వ్యక్తులే నేరుగా ఎల్‌సీలు తీసుకుని విద్యుత్ కనెక్షన్లు, తొలగింపు వంటివి చేపట్టడం గమనార్హం. గృహ, షాపింగ్‌లకు వీరే నేరుగా స్తంభాలు ఎక్కి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి రూ.500 వరకు వసూలు చేస్తున్నట్లు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు వసూళ్ల పర్వం అంతా అసిస్టెంట్లతోనే నడుపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ధరూరులో ఓ లైన్‌మన్ మీటరు కనెక్షన్ కోసం డబ్బులు డిమాండ్ చేసిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. ఇవీ కేవలం బయటకు వచ్చిన సంఘటనలు మాత్రమే బయటకు రానివి మరెన్నో ఉన్నాయి.

విచారించి చర్య తీసుకుంటాం

డబ్బుల వసూలు విషయం నా దృష్టికి రాలేదు. షాబాద్‌కి చెందిన రైతు ఇచ్చిన ఫిర్యాదు ఇన్‌వర్డ్‌లో ఉంటుంది. ప్రస్తుతం ఇతర పనులపై నేను బిజీగా ఉన్నా. ఫిర్యాదును పరిశీలించి సమగ్ర విచారణ చేపడతాం. నిజమని తేలితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– భాస్కర్, ఎస్ఈ, ట్రాన్స్‌కో

కాంగ్రెస్ టికెట్లపై ఉత్కంఠ

- నేడు వెలువడనున్న తొలి జాబితా
- ఆరు నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించే అవకాశం



సాక్షి, నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ తొలివిడత టికెట్ల జాబితాను ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎవరెవరికి టికెట్ దక్కుతుందోనన్నది చర్చనీయాంశంగా మారింది. తొలి జాబితా కింద రాష్ట్రవ్యాప్తంగా 58 స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన ఉండనుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో ఆరుగురు అభ్యర్థుల పేర్లు తొలి జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. అలంపూర్ నియోజకవర్గంలో సంపత్‌కుమార్, కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి, కొల్లాపూర్‌లో జూపల్లి కృష్ణారావు, అచ్చంపేటలో చిక్కుడు వంశీకృష్ణ, జడ్చర్లలో అనిరుధ్‌రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గంలో కసిరెడ్డి నారాయణరెడ్డికి అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. అభ్యర్థుల ప్రకటన తర్వాత ఆయా నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల ప్రచారం జోరందుకోనుంది.

సర్వేల పేరుతో స్క్రీనింగ్..

ఎన్నికలకు కొన్ని నెలల ముందు నుంచే కాంగ్రెస్‌లో అభ్యర్థిత్వం కోసం పలువురు నేతల మధ్య వైరం కొనసాగుతోంది. కొన్ని నియోజకవర్గాల్లో టికెట్ కోసం పోటీ ఎక్కువగా ఉంది. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం టికెట్‌పై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌తో పాటు నాగర్‌కర్నూల్‌లో సమావేశం నిర్వహించి నాగం వర్గీయులు తమకే టికెట్ ఇవ్వాలని గళం విన్పించారు. కొల్లాపూర్ సీనియర్ నేత జగదీశ్వరరావు సైతం తాను ఎన్నికల బరిలో ఉంటానని ప్రకటించారు. పార్టీలో టికెట్ కోసం తీవ్రమైన పోటీ నేపథ్యంలో ఆశావహులను స్క్రీనింగ్ చేసేందుకు కాంగ్రెస్ సర్వేల మంత్రాన్ని ఎంచుకుంది. వీటి ఆధారంగానే గెలుపు అవకాశాలున్న అభ్యర్థులకు టికెట్ ఇస్తున్నామని ప్రకటించింది. టికెట్లు లభించని ఆశావహ నేతలు పార్టీ అభ్యర్థులతో కలసిపోతారా లేక తమదైన దారిని చూసుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది.

ముమ్మర ప్రచారానికి సన్నద్ధం..

ఎన్నికల షెడ్యూల్ వెలువడటం, తొలి విడత అభ్యర్థుల జాబితా విడుదల అనంతరం కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సరళిని వేగవంతం చేసేందుకు సిద్ధమవుతోంది. రెండు రోజుల్లోనే జిల్లాల వారీగా ముఖ్య నేతలతో బస్సు యాత్రలను నిర్వహించనుంది. అలాగే కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ఆరు గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లడాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది.

భజే.. జోగుళాంబ మాత



విద్యుద్దీపాల అలంకరణలో జోగుళాంబ ఆలయం



జోగుళాంబ అమ్మవారి మూలవిరాట్

- నేటి నుంచి ఐదో శక్తిపీఠంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- నవదుర్గలుగా దర్శనమివ్వనున్న జోగుళాంబ అమ్మవారు
- హాజరుకానున్న ప్రముఖులు

జోగుళాంబ శక్తిపీఠం: ఆశ్వీజమాసం పురస్కరించుకొని ఆదివారం నుంచి 24వ తేదీ వరకు అలంపూర్ జోగుళాంబ ఆలయంలో దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగనున్నాయి. రోజూ అమ్మవారిని నవదుర్గల్లో ఒకరైన శైలపుత్రి, బ్రహ్మచారిణీ, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయిని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి రూపంలో అలంకరించి ఆరాధిస్తారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో విద్యుద్దీపాల అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈఓ పురంధర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య తెలిపారు. రోజు మధ్యాహ్న వేళలో తొమ్మిది రకాల నైవేద్యాలతో పాటు అక్కడి యాగశాలలో నవచండీ యాగాలు, కుంకుమార్చన మండపంలో నవావరన అర్చనలు, మహా విద్యపారాయణం, శ్రీ చక్రార్చన తదితర పూజలు నిర్వహిస్తారు.

15 నుంచి ప్రత్యేక పూజలు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా జోగుళాంబ అమ్మవారి ఆలయంలో 15వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. జగద్గురు ఆదిశంకరాచార్యుల శ్రీచక్రయంత్ర స్థాపనతో ఆవిర్భవించిన అమ్మవారిని నవరాత్రుల్లో త్రికాల సమయాల్లో ప్రత్యేక పూజలతో పాటు నవదుర్గ అలంకరణతో ఆరాధిస్తారు. ప్రతిరోజు నిత్యపూజలు, అర్చనలతో ఆలయాలు ప్రత్యేక శోభను సంతరించుకోనున్నాయి. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సేద తీరేందుకు ఆలయ ఆవరణలో టెంట్లు కూడా వేశారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం బాలబ్రహ్మేశ్వరుడి ఆనతి స్వీకరణ, గోప్రదక్షిణ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋుత్విక్ వరుణం, మహా కలశ స్థాపన, అగ్నిముఖము అలాగే సహస్ర నామార్చన, నవావరణార్చనలు, ఆవాహిత దేవత హోమాలు, చండీహోమాలు, అమ్మవారికి దర్బార్‌సేవ, రోజు నవదుర్గ అలంకరణలో కొలవు పూజ, సువాసిని, కుమారి పూజలు, దశవిధ హారతులు నిర్వహిస్తారు.

తెప్పోత్సవం..

తెప్పోత్సవాన్ని ఏటా ఎంతో ఆకర్షణగా నిర్వహించేవారు. ఈసారి తుంగభద్ర నదిలో నీటినిల్వ అంతంత మాత్రంగా ఉండటంతో పుట్టిపై చిన్న హంస వాహనం తయారుచేసి అందులోనే తెప్పోత్సవం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



హాజరుకానున్న ప్రముఖులు..

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో తొలిరోజు కలెక్టర్ వల్లూరి క్రాంతి చేతుల మీదుగా ధ్వజారోహణం జరగనుంది. ఉత్సవాలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, హైకోర్టు న్యాయమూర్తులు, సినీతారలు శ్రీకాంత్, తరుణ్, టార్జాన్, సత్యప్రకాష్ తదితర ప్రముఖులు హాజరుకావచ్చని ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు అంచనా వేస్తున్నారు.

➤ **శైలపుత్రి.. :** నవరాత్రుల్లో శైలపుత్రి ఆరాధన నాంది ప్రస్తానం లాంటిది. శివుడిని పతిగా పొందడానికి తండ్రి అయిన పర్వతరాజు ఆజ్ఞతో కైలాసానికి వెళ్లి పరిచర్యలు చేసి మెప్పు పొంది సతిగా వరాన్ని పొందింది. అందుకే శైలపుత్రిని ఆరాధించడంతో అవివాహితులకు వివాహ ప్రాప్తి కలుగుతుందని దేవీ భాగవతం చెబుతుంది. మొదటిరోజు నీలిరంగు చీరను అమ్మవారికి సమర్పించి ఉప్పు పొంగలిని నివేదన చేస్తారు.

స్కందమాత.. : స్కందమాత అంటే కుమారస్వామికి తల్లిలాంటిది. కుమారస్వామికి ప్రతిరూపం. దుస్వప్నాలను నాశనం చేసే శక్తి ఈ మాతకు ఉంది. అందుకే ఈమెను ఆరాధించే వారికి నిగ్రహశక్తి అధికంగా ఉంటుంది. ఈ రోజు కనకాంబరం రంగు చీర, పెరుగు అన్నం నివేదిస్తారు.

➤ **బ్రహ్మచారిణి.. :** బ్రహ్మ అనగా తపస్సు.. బ్రహ్మచారిణి అనగా తపమొనరిచినదని అర్థం. ఈమె బ్రహ్మ భార్య అయిన సరస్వతి శక్తి. విద్యాధినేత్రి. రెండోరోజు ఈమెను ఆరాధించడంతో వాక్‌శుద్ధి లభించడమేగాక జ్ఞాన అనుగ్రహం కలుగుతుంది. ఈ రోజు అమ్మవారికి పసుపురంగు చీర, పులిహోరను నివేదిస్తారు.

చంద్రఘంటాదేవి.. : చంద్రఘంటా దేవిని పారిజాత పుష్పాలతో ఆరాధిస్తారు. అమ్మవారు పది చేతులతో మహిషాసురిడితో యుద్ధం చేసి రాక్షసగణాన్ని అంతమొందిస్తుంది. అమ్మవారు ఘంటను ఆయుధంగా చేసుకుంటుంది. ఘంటానాథం వినగానే అసురులంతా తమ స్థావరాలకు చేరుకుంటారు. ఉత్తర భారతంలో అమ్మవారి ఆరాధనలో నేటికీ వివిధ రకాల ఘంటానాథాలకు ప్రాధాన్యం ఇస్తూ ఆరాధిస్తారు. ఈ రోజు అమ్మవారికి ఎరుపురంగు చీర, కొబ్బరి అన్నం నివేదిస్తారు.

➤ **కూష్మాండ దేవి.. :** జగన్మాత ఆదిపరాశక్తి చిరునవ్వుతో అలవోకగా ఈ భూ మండలాన్ని సృష్టిస్తుందట. బ్రహ్మాండానికి సంకేతమే కూష్మాండం. అందుకే ఈ అమ్మవారికి కూష్మాండ అనే పేరు వచ్చింది. అమ్మవారు ఆకు, అలము అన్నింటాతానై బ్రహ్మాండానికి సంకేతంగా ఉంటుంది. బ్రహ్మాండమే కూష్మాండ స్వరూపం. ఈ అమ్మవారు మదమెక్కిన అసురుల పాలిట అస్త్రం. ఈమెను ఆరాధిస్తే శతబాధలు తొలగి మానసిక ప్రశాంతత చేకూరడమేగాక విజయం లభిస్తుంది. ఈరోజు నీలిరంగు చీర, అల్లంతో చేసిన గారెలు నివేదిస్తారు.

➤ **కాత్యాయిని.. :** ఆరోరోజు అమ్మవారిని కాత్యాయినీదేవిగా ఆరాధిస్తారు. కాత్య మహర్షి తపస్సు ఫలితంగా కాత్యాయినీదేవి ఆ ఇంట జన్మించిందని.. అందుకే అమ్మవారికి కాత్యాయిని అనే పేరు వచ్చిందని ప్రతీతి. మాతను ఆరాధించడం, వ్రతం చేయడంతో కన్యకామునులు ఇష్టదైవంతో పోలిన భర్తలు లభిస్తారని దేవి భాగవతం చెబుతుంది. అంతేగాక సుఖశాంతులు, ప్రశాంతత చేకూరుతుంది. ఈ రోజు ఎరుపురంగు చీర, రవ్వ కేసరి నివేదిస్తారు.

➤ **కాళరాత్రి దేవి.. :** దుష్టులకు భయంకరిగా కనిపించే ఈ అమ్మవారు కుడిచేతిలో అభయ ముద్ర, ఎడమ చేతిలో ఖడ్గం, మరో చేతిలో ఇనుప ముళ్లు ఉన్న ఆయుధం, మెడలో ఇనుప గొలుసులు కలిగి ఉంటుంది. అత్యంత భయంకరంగా కనిపించే ఈమె నల్లటి ముఖంతో ఎరుపెక్కిన కనులతో గాడిదను వాహనంగా చేసుకొని చాట, చీపురును ఆయుధాలుగా ధరించి కిరాతక రాక్షసులకు సైతం భయం కలిగిస్తుంది. తన భయంకరమైన వికత రూపం, కేకలతో రాక్షసుల మనసును కాకావికలం చేస్తుంది. ఈ రోజు తెలుపురంగు చీర, కదంబాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు.

➤ **మహాగౌరి.. :** ఎనిమిదో రోజు అమ్మవారిని మహాగౌరీ, మహా సరస్తిదేవిగా అలంకరించి ఆరాధిస్తారు. ఈమె అర్ధనారి స్వరూపం. సృష్టికేళి విలోలుడైన తాండవమూర్తిని తను అపర్ణ రూపంలో తపస్సు చేసి ఈశ్వరుడిని వరంగా పొందుతుంది. అందుకే ప్రతి పెళ్లికూతురు తప్పనిసరిగా గౌరీపూజ చేసి మాంగళ్య ధారణ యోగ్యత పొందుతారు. ఈరోజు ఎరుపురంగు చీర, మినప గారెలు నైవేద్యంగా సమర్పిస్తారు.

➤ **సిద్ధిధాత్రి.. :** ఏ ఫలాన్ని ఆశించి వ్రతం చేస్తామో ఆ ఫలితాన్ని అనుగ్రహించే దేవతనే సిద్ధిధాత్రి. అనిమా సిద్ధి.. మహిమా సిద్ధి.. గిరిమా సిద్ధి అంటూ ఈ అమ్మవారు అష్టసిద్ధులను ప్రసాదిస్తుందట. ఈ అమ్మవారి ఆరాధనతో నవరాత్రి ఫలితం రావడమేగాక సకల అభీష్టసిద్ధి నెరవేరుతుంది. ఈ రోజు అమ్మవారికి పసుపురంగు చీర, దద్ధోజనం నైవేద్యంగా సమర్పిస్తారు.

సడక్ బంద్ ఉద్రిక్తం



జడ్చర్లలో హైవేపై బైఠాయించిన కాంగ్రెస్, వామపక్ష నాయకులు



హైవేపై నిలిచిన వాహనాలు



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

- అఖిలపక్షం ఆధ్వర్యంలో 44వ నంబర్‌జాతీయరహదారిపై ఆందోళన
- టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు

జడ్చర్ల టౌన్/అలంపూర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన సడక్ బంద్ ఉద్రిక్తంగా మారింది. అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద, జడ్చర్ల ప్రభుత్వ అతిథి గృహం సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ఆందోళనకు దిగారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, తెలంగాణ జన సమితి, బీఎస్పీతో పాటు పలు విద్యార్థి సంఘాలు ఇందులో పాల్గొన్నాయి. జడ్చర్ల వద్ద దాదాపు గంటన్నర రాస్తారోకో చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీఎస్‌పీఎస్సీని రద్దు చేసి, కొత్త బోర్డును నియమించాలని, నిరుద్యోగులకు రూ.3లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రహదారి దిగ్బంధం వల్ల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ఆందోళన విరమించాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాస్తారోకోలు, ఆందోళనలకు అనుమతి లేదని చెప్పిన వారు వినకపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి అనిరుద్‌రెడ్డి తదితరులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అదనపు బలగాలను రప్పించి, ఆందోళనకారులను చెదరగొట్టి, నాయకులను అరెస్టు చేశారు. అనంతరం సొంతపూచికత్తిపై విడుదల చేశారు.

రెండునెలల్లో సమస్యలన్నీ తీరుస్తాం

రెండు నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, నిరుద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతుందని, టీఎస్‌పీఎస్సీని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించినట్లుగా 13,500 ఉద్యోగాలతో మెగా డీఎస్సీ వేయకపోవటం వల్ల యువతి ఆత్మహత్యకు పాల్పడిందని, ఆ యువతిది ప్రభుత్వ హత్యేనన్నారు. టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారన్నారు. ఇచ్చిన నోటిఫికేషన్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ పేపర్ లీకేజీలతో అభ్యర్థుల ఆత్మహత్యల వైపు దారితీసేలా ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు.

ప్రభుత్వం బాధ్యత వహించాలి

నిరుద్యోగుల ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశరావు అన్నారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద డీఎస్సీ అభ్యర్థి ఆత్మహత్యను నిరసిస్తూ బీఎస్పీ అధ్వర్యంలో శనివారం సడక్ బంద్ నిర్వహించారు. పోలీసులు నాయకులను అదుపులోకి తీసుకుని ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుద్యోగులను పొట్టనపెట్టుకుంటుందని ఆరోపించారు. డీఎస్సీ అభ్యర్థి ప్రవళిక ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగానే నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. పదేళ్లుగా నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. కార్యక్రమంలో మల్లీశ్వరి, షాహినాబేగం, తిరుపాల్, సుంకన్న, కనకంబాబు, మధుగౌడ్, రవిచందర్, ప్రభుదాస్, శాంతకుమార్, రాంప్రసాద్ రెడ్డి, వెంకటేష్, జలేందర్, బుడ్డన్న తదితరులు ఉన్నారు.

రూ.3లక్షల పరిహారం ఇవ్వాలి

గ్రూపు పరీక్ష రద్దు చేసినందున అభ్యర్థులకు ప్రభుత్వం రూ.3లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. గ్రూప్–1 పరీక్ష రెండుసార్లు రద్దు కావటం, గ్రూప్–2 పరీక్ష వాయిదా పడటం వల్ల ఎంతో మంది నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. పరీక్షలకోసం అద్దె గదులు తీసుకుని, రూ.వేలు వెచ్చించి ట్యూషన్లకు వెళ్లిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ మాట్లాడుతూ తొమ్మిదిన్నరేళ్లుగా నిరుద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుందన్నారు. అసెంబ్లీలో 13,500 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తర్వాత 5వేలకు నోటిఫికేషన్లు వేయటం వల్ల నిరుద్యోగులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. ప్రతి నిరుద్యోగి పది మందిని కలిస్తే నాలుగు కోట్ల మందిని కలుసుకునే అవకాశం ఉందని, ప్రభుత్వ తీరును వారికి వివరించి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం నేర్పాలని పిలుపునిచ్చారు.

కిక్కిరిసిన కురుమూర్తి గిరులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: అమావాస్య, శనివారం పురస్కరించుకొని అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి సుప్రభాతసేవ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచే దర్శనానికి బారులుతీరారు. కొందరు భక్తులు తడి దుస్తులతో మెట్లపై దీపాలు వెలిగిస్తూ గోవింద నామస్మరణతో స్వామి చెంతకు చేరారు. పలువురు కొండ దిగువన మట్టికుండల్లో పచ్చిపులుసు, అన్నం తయారుచేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, ఉద్దాల మండపం, జాతర మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది.

రాకపోకలకు ఇబ్బందులు..

ఆలయ ప్రాంగణంలోని దిగుడు మెట్లపై టేబుల్స్ వేసి లడ్డూ ప్రసాదాలు విక్రయించడంతో కొండ పైనుంచి కిందకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడ్డారు. మెట్ల సమీపంలో షెడ్లు ఏర్పాటు చేసి ప్రసాదం విక్రయిస్తే ఇబ్బందులు ఉండవని కొందరు భక్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి వద్ద ప్రస్తావించగా రెండు, మూడురోజుల్లో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు.

➡ గత నెల 14 అమావాస్య రోజున భక్తులకు తాగునీరు అందక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని 'సాక్షి' దినపత్రికలో ప్రచురించగా.. స్పందించిన అధికారులు ఈసారి దర్శనానికి వెళ్లే మార్గంలో అక్కడక్కడ కొళాయిలను ఏర్పాటు చేశారు.

ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన ప్రకటన చేయాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న మందకృష్ణ

నాగర్‌కర్నూల్ రూరల్/బిజినేపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. విశ్వరూప మహా పాదయాత్ర శనివారం బిజినేపల్లి మీదుగా జిల్లా కేంద్రానికి చేరింది. యాత్రలో టీడీపీ అచ్చంపేట అసెంబ్లీ అభ్యర్థి మోపతయ్య, నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జ్ శ్రీపతయ్య పాల్గొని మద్దతు ప్రకటించారు. జిల్లా కేంద్రంలో మందకృష్ణ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు ఎస్సీ వర్గీకరణపై హామీలు ఇచ్చి, తదానంతరం మాట మరుస్తున్నారని ఆరోపించారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నో చట్టాలను అమలు చేస్తున్న కేంద్రం.. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఎందుకు జాప్యం చేస్తుందని ప్రశ్నించారు. నవంబర్ 7న నిర్వహించనున్న విశ్వరూప మహాసభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గూట విజయ్, మంగి విజయ్, లక్ష్మయ్య, నిరంజన్ పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

మహమ్మదాబాద్: బైకుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గండేడ్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వికారాబాద్ జిల్లా కుల్కచెర్ల మండలం అంతారం గ్రామానికి చెందిన కుమ్మరి తిరుపతయ్య (38) బైక్‌పై శుక్రవారం గండేడ్ మండలం పగిడ్యాల్‌లోని తన సోదరి దగ్గరకు వచ్చాడు. రాత్రి 8:30గంటల ప్రాంతంలో తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా, బైక్ అదుపు తప్పి నిర్మాణంలో ఉన్న డ్రెయినేజీ కాల్వలో పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి



అంజిలయ్య మృతదేహం

మహమ్మదాబాద్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్‌లో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గాధిర్యాల్‌కు చెందిన గండీటి అంజిలయ్య (48) సాగు చేసిన వరి పంట కోతకు రావడంతో శనివారం వరికోత మిషన్‌తో పొలానికి వెళ్లాడు. పొలంలో ఉన్న విద్యుత్ వైర్లు వరికోత మిషన్‌కు తాకుతాయన్న కారణంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేస్తుండగా, ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యవసాయ పొలంలో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు. మృతుడి భార్య సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

బిజినేపల్లి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కారుకొండలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాములుయాదవ్ వివరాల మేరకు.. మిద్దె మహేష్ (34) కొంతకాలంగా ఖాళీగా ఉంటున్నాడు. కుటుంబ పోషణ విషయంపై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు.. వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నారు. తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జడ్చర్లలో భారీగా పేలుడు పదార్థాల పట్టివేత



జయప్రకాశ్‌నగర్‌లోని ఇంటిలో నిల్వ ఉన్న పేలుడు పదార్థాలు

జడ్చర్ల: ఈనెల 18న సీఎం కేసీఆర్ పర్యటన ఉన్న నేపథ్యంలో జడ్చర్ల పట్టణ శివారులోని జయప్రకాశ్ నగర్‌లోని ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు పట్టుబడడం కలకలం రేపింది. సీఐ రమేశ్‌బాబు కథనం ప్రకారం.. జయప్రకాశ్‌నగర్‌లోని ఓ ఇంటిలో పేలుడు పదార్థాలను రహస్యంగా నిల్వ ఉంచారని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో భారీగా జిలెటిన్ స్టిక్స్ మరియు డిటోనేటర్లు ఉండడంతో వాటిని పోలీసులు స్వాధీన పర్చుకున్నారు. మొత్తం 11 బాక్సుల్లో 1,513 జిలెటిన స్టిక్స్, 350 డిటోనేటర్లతో పాటు రెండు బాక్సులలో 4 బెండల్స్ ఎక్స్‌టెన్షన్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.లక్ష ఉన్నట్లుగా అంచనా వేస్తున్నారు. నల్లగొండ జిల్లా జనగామ మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన ప్రశాంత్, తిప్పర్తి మండలానికి చెందిన సుధాకర్‌రావు ఈ ఇంటిని అద్దెకు తీసుకుని పేలుడు పదార్థాలను నిల్వ ఉంచినట్లుగా పోలీసులు గుర్తించారు. జడ్చర్ల చుట్టుపక్కల ప్రాంతాలలో గల గుట్టలను, బండరాళ్లను పేల్చేందుకు ఈ పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు. పేలుడు పదార్థాల నిల్వ, వినియోగానికి సంబంధించి ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రముఖుల బహిరంగ సభలు, తదితర కార్యక్రమాలు నిర్వహించే పరిస్థితులు ఉన్న కారణంగా పేలుడు పదార్థాలు పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది.

జూరాలకు ఇన్‌ఫ్లో నిల్

గద్వాల రూరల్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి కొన్ని రోజులుగా స్వల్పంగా వస్తున్న ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గిందని పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు ఎలాంటి ఇన్‌ఫ్లో లేదని పేర్కొన్నారు. ఆవిరి రూపంలో 113, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఎడమ కాల్వకు 1,250, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 100, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.396 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో 848.7 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం 848.7 అడుగుల వద్ద 77.1 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 33,549 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,560, కేసీ కెనాల్‌కు 337, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,967 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 2.415 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 4,852 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 222 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

లారీ, డీసీఎం ఢీ : ఒకరి దుర్మరణం

వెల్దండ: మండల కేంద్రం సమీపంలో శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. డ్రైవర్ నాగపతిరావు(28), క్లీనర్ జనుప్‌సింగ్ డీసీఎంలో మెదక్ జిల్లా నుంచి తెల్కపల్లికి కోడి పిల్లలను తరలిస్తున్నారు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై మండల కేంద్రం సమీపంలో రోడ్డు పక్కన నిలిపిన లారీని డీసీఎం ఢీకొంది. డీసీఎం డ్రైవర్ నాగపతిరావు మృతిచెందగా.. క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి అటునుంచి హైదరాబాద్ తరలించారు. నాగపతిరావుది భద్రాది కొత్తగూడెం జిల్లా కాగా.. క్లీనర్ మధ్యప్రదేశ్‌కు చెందిన వాడిగా గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.